## క్లుప్తంగా

### డీఈఓ పరిశీలన



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

**గుమ్మలక్ష్మీపురం:** స్థానిక ఎమ్మార్సీ(విద్యావనరుల కేంద్రం)కి చేరిన జగనన్న విద్యాకానుక కిట్లను డీఈఓ నిమ్మక ప్రేమ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అనంతరం మండలంలోని మొత్తం విద్యార్థుల సంఖ్య, అక్కడి వచ్చిన పాఠ్యపుస్తకాల వివరాలపై ఆరాతీశారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే వీటిని విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు ఉన్నారు.

### ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సాలూరు:** మండలంలోని పురోహితునివలస ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ,బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్,సీఎస్ఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్హులైన వారు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం నుంచి వచ్చే నెల 7 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9492022780, 9492377802, 8464809794 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### తాగునీటి సరఫరా పునరుద్ధరణ



పైప్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న దృశ్యం

**సీతానగరం:** మండలంలోని వెంకటాపురం గ్రామానికి ఇంటింటి కుళాయి పథకం ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరణ జరిగిందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.గౌరునాయుడు, బి.ముకుందరావు ఆదివారం సాయంత్రం తెలియజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి ఇంటింటి కుళాయిలకు తాగునీరందించే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల బారిన పడడంతో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఆదివారం సాయంత్రం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.

### నేడు మామిడిపల్లిలో వలంటీర్లకు వందనం

**సాలూరు:** మండలంలోని మామిడిపల్లిలో సోమవారం నిర్వహించనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పాల్గొనున్నారు. ఈ మేరకు వైస్ఎంపీపీ రెడ్డి సురేష్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

### 'గడగడపకు' అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**సీతానగరం:** మండలంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో అధికారులు మంజూరుచేసిన సామాజిక పరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో రూ.20 లక్షలతో పనులు చేపట్టారని, ఇప్పటికే లచ్చయ్యపేట, నిడగల్లు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులను పరిశీలించామని తెలియజేశారు. నిర్వాహకులు స్పందించి పనులు వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. బిల్లులకు నిధుల కొరతలేదని గుర్తు చేశారు.

### నాడు-నేడు పనుల ప్రారంభం



కొత్తవలస పాఠశాలలో జరుగుతున్న ఫ్లోరింగ్ నిర్మాణ పనులు

**రాజాం:** పట్టణ పరిధిలోని కొత్తవలస యూపీ స్కూల్‌లో రెండో విడత మనబడి నాడు–నేడు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నామని, ఇప్పటివరకు రూ.8 లక్షలు మంజూరయ్యాయని ప్రధానోపాధ్యాయుడు కుదమ తిరుమలరావు తెలిపారు. మూడు తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్ వేయడంతో పాటు అదనంగా నాలుగు మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

**వీరఘట్టం:** కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలానగరం గ్రామంలో ఆదివారం పర్యటించిన ఆయా నేతలకు గ్రామస్తులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల బాగోగులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అభివృద్ధి, పథకాలను సమాంతరంగా అమలు చేస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే వచ్చేవి కావన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్ల ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే పథకాలు అందుతున్నాయన్నారు. అవసరమైన చోట అభివృద్ధి పనులు కూడా మంజూరవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణనాయుడు, సర్పంచ్ పురుషోత్తమరావునాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలవలస దవళేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు పాల్గొన్నారు.

# 'వలంటీర్లకు వందనం'



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

**వీరఘట్టం:** మండలంలోని నీలానగరం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి ఉత్తమ గ్రామ సచివాలయ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరించారు. ఇదే స్ఫూర్తితో ముమ్మందు కూడా కూడా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని నేతలు కోరారు.

### నేడు పనసనందివాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**వీరఘట్టం:** మండలంలోని పనసనందివాడ గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నేతలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

### రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

**పాలకొండ:** రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి వై.వాహిణి ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఇవి ఉన్నాయని, కావాల్సిన వారు అక్కడి సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలన్నారు.

### హెచ్ఐవీ తగ్గుముఖం



ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

**పార్వతీపురంటౌన్:** హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి జిల్లాలో తగ్గుముఖం పట్టిందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి జగన్నాథరావు తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ మృతుల స్మారక దినాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 1983వ సంవత్సరం నుంచి ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబాలకు సమాజం అండగా ఉంటుందని భరోసా ఇస్తూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 40వ అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తులతో స్మారక దినం నినాదంతో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ఎస్‌జీఓ హోమ్, వరకుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డా.శ్యామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కోతకు సిద్ధంగా వరిచేలు

**సీతానగరం:** మండలంలోని రబీవరిచేను పంట పనుల్లో రైతులు నిమగ్న మయ్యారని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ 2022- 23 ఖరీఫ్‌సీజన్‌లో వరిపంట తీసిన అనంతరం నీటివనరులున్న బుడ్డిపేట, వెంకటాపురం, లక్ష్మీపురం, బీకే పురం, చినభోగిలి, చెల్లంనాయుడువలస, పెదంకలాం తదితర గ్రామాల రైతులు 450 ఎకరాల్లో రబీ వరి సాగు చేశారన్నారు. వరిచేను పంటకు రావడం తో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. రబీ వరిసాగు చేస్తున్న రైతులు ఆర్బీకేల్లోనే విక్రయించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటసాగుకు అవసరమైన ఎరువులు విత్తనాలు ముందు జాగ్రత్త చర్యగా ఆర్బీకేల్లో నిల్వలుంకచినట్లు చెప్పారు. ఆర్బీకేల్లో ఈ క్రాప్ బుకింగ్ చేసిన రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు సరఫరా చేస్తామని తెలిపారు.

# తప్పుడు కేసులు పెట్టించడం సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

**గుమ్మలక్ష్మీపురం:** స్వార్థ రాజకీయాల కోసం తప్పుడు కేసులు పెట్టించడం సరికాదని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండలంలోని చింతలపాడు గ్రామ ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావుపై అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కాంగ్రెస్ పార్టీ నేత నిమ్మక సింహాచలం పోలీసులకు ఫిర్యాదు చేయించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన వలంటీర్ అయిన సదరు మహిళ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన కారణంగా ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి నుంచి ఆమెకు తొలగింపు ఉత్తర్వులు వెళ్లాయని, దీనికి ఎంపీటీసీ లక్ష్మణరావు కారణమని ఆమెతో పోలీసులకు ఫిర్యాదు చేయించడం వెనక రాజకీయ దురుద్దేశం ఉందన్నారు. వాస్తవాలేమిటో పోలీసుల దర్యాప్తులో తెలుస్తాయన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం జరగకపోయినా తానే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడునని సింహాచలం చెప్పుకుని, తిరగడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా స్వార్థపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, పార్టీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కో దగ్గర ఒక్కోలా పనులు

- కురుపాం రోడ్డు విస్తరణ పనులపై స్థానికుల ఆందోళన



కురుపాంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**కురుపాం:** మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు ఒక్కో దగ్గర ఒక్కోలా జరుగుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఏడు మీటర్ల దూరం వరకు ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు నిర్ణయించి, పనులు కూడా చేపడుతున్నారు. ధూళికేశ్వరాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు జరుగుతున్న పనుల్లో ఓ చోట కొలతల ప్రకారం మరోచోట వాస్తవ కొలతలు తగ్గించి, ఆక్రమణలు తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్ కూడలి వద్ద కొలతలు తగ్గించి, ఆక్రమణలు తొలగిస్తున్నారని, ఇలా ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ డీఈఈ నాగమోహన్‌రావు వద్ద ప్రస్తావించగా, కొలతల ప్రకారమే పనులు జరుగుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలడం గమనార్హం.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న పాలకొండ సీఐ మురళీధర్

**భామిని:** మండలంలోని బత్తిలి పోలీస్‌స్టేషన్‌ను పాలకొండ సీఐ కె.మురళీధర్ ఆదివారం సందర్శించారు. అనంతరం రికార్డులు, వివిధ కేసుల దర్యాప్తు పరిస్థితులపై ఆరాతీశారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని, దర్యాప్తు చర్యలను వేగవంతం చేయాలని ఎస్ఐ వై.అమ్మనరావుకు సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

# ఈదురుగాలుల బీభత్సం



విద్యుత్ తీగలపై నుంచి రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

**గరుగుబిల్లి:** మండలంలోని తోటపల్లి, సంతోషపురం, సుంకి, గిజబ గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం వీచిన గాలుల ధాటికి కొన్నిచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరికొన్నిచోట్ల గాలి వేగానికి అరటిపంట, మామిడి పంట నేలరాలింది. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంపై బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఇద్దరి అరెస్ట్

**బాడంగి:** మండలంలోని డొంకినవలస సమీపంలో మద్యం తరలిస్తున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన జామి కృష్ణ, బంగారునాయుడులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్ .జయంతి తెలిపారు. వీరి నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, బొబ్బిలి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

### చురుగ్గా గ్రావెల్ రోడ్డు నిర్మాణం

**రేగిడి:** మండలంలోని సంకిలి గ్రామ యాదవ వీధిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నామని, త్వరితగతిన పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి తెలిపారు.

### ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



వైద్యపరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే

**పార్వతీపురంటౌన్:** జిల్లా కేంద్రంలో గల శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సభ్యులు వారణాసి కల్యాణి, మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గెంబలి బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్నారై ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలను చేసుకోగా శిబిరంలో ఎమ్మెల్యే కూడా శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం ప్రాంతంలో ఇటువంటి గొప్ప ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన మిత్రులు బాలమురళీకృష్ణ , కౌన్సిలర్ కల్యాణిలను అభినందించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం పెద్దలు, సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సరోజిని నాయుడు జీవితచరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయుడు స్వామినాయుడు



పాలకొండ రూరల్: చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

**గరుగుబిల్లి:** వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించడమే ముఖ్య లక్ష్యంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు కోరారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సరోజినినాయుడు జీవితచరిత్రను ఉపాధ్యాయుడు కె.స్వామినాయుడు వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. అనంతరం చదువు, గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించి, చెస్, క్విజ్ పోటీలు నిర్వహించారు.

**పాలకొండ రూరల్:** సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ప్రతిరోజూ ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా విద్యార్థులు గ్రంథాలయాలకు చేరుకుని, ఎన్నో విజ్ఞాన విషయాలను నేర్చుకుంటున్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ చేసిన టీచర్ శాంతకుమారిని సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం గ్రంథాలయ కార్యదర్శి శంకర్, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు, డ్రాయింగ్ టీచర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం




బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

**వీరఘట్టం:** సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయనిధి) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండవ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీతంపేట మండలంలోని వజ్జాయిగూడకు చెందిన సవర బుగ్గన్నకు మంజూరైన రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. ఏప్రిల్ 18వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి సదరు వ్యక్తి తన నోటి క్యాన్సర్ సమస్యను వివరించి, ఆర్థికసాయం కోసం అభ్యర్థించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయనతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించి, ఆర్థికసాయం అందేలా చొరవ తీసుకోవడం విశేషం. అన్ని వర్గాల ప్రజల బాగోగులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆయన లాంటి ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమని ఎమ్మెల్యే అన్నారు.

# ముమ్మరంగా వరి కోతలు



బత్తిలిలో యంత్రం సహాయంతో వరి కోత చేపడుతున్న రైతులు

**భామిని:** మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బొమ్మిక, కాట్రగడ–బి, బత్తిలి గ్రామాల్లోని పలువురు రైతులు వరి పంట వేశారు. ప్రస్తుతం అవి కోత దశకు చేరుకోవడంతో యంత్రాల సహాయంతో పంట కోత, నూర్పిడి చేస్తున్నారు. కొన్నిరోజులుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురస్తుండడంతో అప్రమత్తమైన రైతులు తాము వేసిన వరి పంటను చకచకా కోసేసి, ఇళ్లు, కల్లాలలకు చేరుస్తున్నారు. వర్షానికి ఏదైనా నష్టం జరిగితే తట్టుకోలేమని, అందుకే ముందస్తు జాగ్రత్తగా పంటను కోసి, భద్రపరుస్తున్నామని అన్నదాతలు చెబుతున్నారు.

# అడ్వంచర్ పార్కులో పర్యాటకుల సందడి



టాయ్ ట్రైన్‌లో తిరుగుతున్న చిన్నారులు



స్కై సైక్లింగ్ చేస్తున్న యువతి, యువకుడు



జలవిహార్‌లో పర్యాటకుల బోటు షికారు

**సీతంపేట:** స్థానిక అడ్వంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి పార్కు అందాలను చూసేందుకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. కొంతమంది అక్కడి జలవిహార్‌లో బోటుషికారు చేసేందుకు ఆసక్తి కనబరచగా, మరికొంతమంది బంజీట్రంపోలిన్, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి ఆనందించారు.